క్లుప్తంగా

అలరించిన నృత్య పోటీలు



హన్మకొండ: హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో రెండు రోజుల పాటు జరిగిన నృత్య పోటీలు శనివారం ముగిశాయి. మెగా కోమల ఏరోబిక్స్, డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో ఇండియా లెవల్ నృత్య పోటీలు జరిగాయి. న్యాయనిర్ణేతలుగా శరత్ రెడ్డి, రేణుక వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందించారు. కళాకారుల్లో దాగి ఉన్న కళను వెలికితీయడానికి ఎనిమిదేళ్లుగాపోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు గాదె క్రాంతి కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు రాజ్ కుమార్, చింటు, ప్రణయ్, సాయి, శ్యాం, బాలు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఖిలా వరంగల్: వరంగల్ 38వ డివిజన్ ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1978–1979వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థి బండి కోటేశ్వర్‌రావు తెలిపారు.

ఫుట్‌బాల్ జిల్లా జట్టులో సీతంపేట క్రీడాకారుడు



హసన్‌పర్తి: ఈనెల 28నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరగనున్న సీఎం కప్ పోటీల్లో సీతంపేటకు చెందిన చిర్ర యువకృతిక్ ఫుట్‌బాల్ పోటీల్లో ఆడనున్నారు. ఈమేరకు హనుమకొండ జిల్లా జట్టులో యువకృతిక్ ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఎంపీటీసీ బండారి రజిత తెలిపారు.

'మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలి'

న్యూశాయంపేట: బీజేపీ మతోన్మాద చర్యలను ప్రజలు వ్యతిరేకించి, తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. హనుమకొండ రాంగనర్‌లోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య అధ్యక్షతన శనివారం సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ తొమ్మిదేళ్లుగా అనుసరిస్తున్న కార్పొరేట్ మతోన్మాద విధానాలను కార్మికులు తిప్పికొట్టాలని సూచించారు. నాయకులు రవి, సారంగపాణి, సంపత్, రజిత, లింగమూర్తి, యాకయ్య, రవీందర్, వెంకన్న పాల్గొన్నారు.

రాజ్యాంగ గ్రంథం ఇవ్వాలి

హన్మకొండ అర్బన్: భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అందుకోసం ఇంటింటికి రాజ్యాంగాన్ని ఉచితంగా అందించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కోరారు. ఈమేరకు హనుమకొండ తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు గోల్కొండ రాజేష్, అలువాల కుమార్, మైదం రవి, దామెర రాజు, కుమార్, సలీంపాషా, రాహుల్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

వరంగల్ అర్బన్: 40వ డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. ఈమేరకు కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను ప్రధాన కార్యాలయంలో శనివారం కలిసి విజ్ఞప్తి చేశారు.

కాలనీల అభివృద్ధికి కృషి చేయాలి

ఖిలా వరంగల్: అంతర్గత కాలనీల అభివృద్ధికి కృషి చేయాలని శంభునిపేట, రంగశాయిపేట 21 కాలనీల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కర్నె రవీందర్, కార్యవర్గ ప్రతినిధులు కోరారు. ఈమేరకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను హనుమకొండలోని ఆయన నివాసంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రామానుజం, జగదీశ్వర్‌స్వామి, నాగబంది శ్రీనివాస్ గుప్తా, సదానందం ఉన్నారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య



యాదగిరి (ఫైల్)

కాశిబుగ్గ: ఆర్థిక సమస్యల కారణంగా గూడ్స్ రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ – చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గుడిమహేశ్వరం గ్రామానికి చెందిన భట్టు యాదగిరి(40) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం ట్రాక్టర్ కొనుగోలు చేయగా, అది సరిగా నడవకపోయేసరికి ఆర్థిక పరమైన సమస్యలు ఎదురయ్యాయి. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం సాయంత్రం వరంగల్ వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరి ధర్మారం శ్మశాన వాటిక సమీపంలో బైక్ అక్కడ పెట్టి గూడ్స్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదుతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

హైవేపై అంధకారం

- ప్రతిపాదనలకే పరిమితమైన ఖమ్మం రహదారి సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ
- ఏర్పాటు చేయని డివైడర్‌లు
- పట్టించుకోని అధికారులు
- నిత్యకృత్యంగా రోడ్డు ప్రమాదాలు





వీధిదీపాలు, డివైడర్ లేని ఖమ్మం జాతీయ రహదారి

ఖిలా వరంగల్: జాతీయ రహదారిపై తమ వాహనాలను రయ్.. రయ్‌మనిపించే వాహనచోదకులు ఇక్కడ మాత్రం అప్రమత్తం కావాల్సిందే. ఎందుకంటే రోడ్డు పక్కనే హోటళ్లు, వైన్స్‌ల వద్ద రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలిపివేసిన వాహనాలు కొన్నిసార్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఘటనలు జరిగినప్పుడు హడావుడి చేసే అధికారులు ఆ తర్వాత పెద్దగా దృష్టి సారించకపోవడంతో పరిస్థితి మొదటికి వస్తోంది. ఇదీ.. ఖిలా వరంగల్ మండలం ఆర్టీఏ జంక్షన్ నుంచి ఐనవోలు క్రాస్ వరకు సుమారు 5కిలోమీటర్ల పొడవున ఉన్న జాతీయ రహదారిపై పరిస్థితి.

ఆగి ఉన్న వాహనాలను ఢీకొని..

ఖిలా వరంగల్ మండలం నాయుడు పెట్రోల్‌బంక్ పక్కన హోటళ్లు, వైన్ షాపు ఉండటంతో వాహనాలు, లారీలను కొందరు హైవేపైనే నిర్లక్ష్యంగా నిలిపివేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఆగిఉన్న వాహనాలను ఢీకొనడంతోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్టీఏ జంక్షన్ నుంచి ఐనవోలు క్రాస్ వరకు వైన్‌షాపు, హోటళ్లు, పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. ఈ రహదారి వెంబడి లారీలకు సరైన పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా రోడ్డుపైనే నిలపడంతో ప్రమాదాలు ఎక్కువయ్యాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీల సంగతి చెప్పనక్కరలేదు. అతివేగంతో పాటు ఓవర్‌లోడుతో ప్రయాణం వల్ల లారీలు అదుపు తప్పి ఎదురుగా వచ్చే వాహనాల ఢీకొట్టడంతో విలువైన ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయి.

- హైవేపై అంధకారం, రోడ్డుపై లారీలు నిలిపి ఉండడంతో నాయుడు పెట్రోల్ బంక్ వద్ద రోడ్డును దాటుతుండగా 67 ఏళ్ల వృద్ధుని లారీ ఢీకొట్టింది. దాంతో అతని రెండు కాళ్లు విరగగా ప్రాణపాయ స్థితిలోకి వెళ్లాడు.
- నగర పరిధిలో హైవేపై విద్యుత్ దీపాలు లేవు. రామకిష్టాపురం స్టేజీ వద్ద జాతీయ రహదారిపై రాత్రి సమయంలో తెల్లవారుజామున ఎదురుగా వచ్చే ఆటోను లారీ ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు.

ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు..

వరంగల్ ఆర్టీఏ జంక్షన్ నుంచి ఐనవోలు క్రాస్‌వరకు జాతీయ రహదారి వెంట ఉన్న నడక దారిని ఆక్రమించి వ్యాపారాలు చేయడం, ఇతర వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల పాదచారులు ప్రధాన రహదారి వెంబడి వెళ్తుండగా ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. మామునూరు పోలీస్ స్టేషన్ సమీపంలోనే ఫుట్‌పాత్‌ను లారీలు ఆక్రమించినా జాతీయ రహదారి నిర్వహణ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

పలువురి మృత్యువాత

గడిచిన ఐదు నెలల్లో ఆర్టీఏ జంక్షన్ నుంచి ఐనవోలు క్రాస్ వరకు సుమారు 5కిలోమీటర్ల పొడవు గల జాతీయ రహదారిపై పోలీసుల రికార్డుల ప్రకారం 40పైగా ప్రమాదాలు జరిగాయి. హైవేపై ప్రధానంగా నాయుడు పెట్రోల్ పంపు, హంటర్ రోడ్డు, తిమ్మాపురం క్రాస్‌రోడ్డు, టీఎస్ఎస్పీ బెటాలియన్ ప్రధాన గేట్ ఎదుట, మామునూరు చెరువుకట్ట, వాగ్దేవి కళాశాల సమీపం, బొల్లికుంట క్రాస్‌రోడ్డు, ఐనవోలు క్రాస్‌రోడ్డును ప్రమాదాల జోన్లుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల్లో 40మందికి పైగా క్షతగాత్రులు కాగా, పలువురు మృత్యువాత పడ్డారు.

అంధకారంతో తరచూ ప్రమాదాలు

వరంగల్ ఆర్టీఏ జంక్షన్ నుంచి ఐనవోలు క్రాస్ వరకు అత్యంత ప్రమాదకర జోన్‌గా గుర్తించారు. ఈరోడ్డుపై ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి. ఈ రోడ్డుపై ప్రమాదం జరిగితే బతికి బయటపడడం గగనంగా మారింది. జాతీయ రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. రాత్రిపూట విద్యుత్ దీపాలు లేక అంధకారం నెలకొనడంతో మరింత రెట్టింపుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అంధకారమైన రహదారిపై ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్నారు. చీకటి పడిన తరువాత ఈ రహదారిపై అంధకారం అలుముకుంటోంది. దాంతో వాహనదారులు భయంగా భయంగా ప్రయాణం చేస్తుంటారు. నగర పరిధిలోని హైవేపై విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. దాంతో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. దాంతో హామీ నెరవేరడం లేదు.

ప్రమాదాల నివారణకు చర్యలు



జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నాం. లైటింగ్, డివైడర్ ఏర్పాటు చేస్తే ప్రమాదాల తగ్గుతాయని గుర్తించాం. ప్రమాదకర కూడళ్లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేశాం. అతివేగంగా వెళ్తున్న వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం. జాతీయ రహదారి వెంట హోటళ్లు, వైన్స్ షాపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించి సంబంధిత యజమానులకు నోటీసులు ఇస్తున్నాం.

– క్రాంతికుమార్, ఇన్‌స్పెక్టర్, మామునూరు

లైటింగ్ ఏర్పాటు చేయాలి



వరంగల్ ఆర్టీఏ జంక్షన్ నుంచి ఐనవోలు క్రాస్ రోడ్డు జంక్షన్ వరకు సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ లేదు. దాంతో రాత్రి అయితే జాతీయ రహదారి అంధకారం అలుముకుంటోంది. ఈక్రమంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిపై ప్రయాణం చేయాలంటేనే భయమేస్తోంది. ఒకపక్క అంధకారం, మరోపక్క లారీల పార్కింగ్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు పట్టించుకోవాలి.

– ఇనుగాల జోగిరెడ్డి, తిమ్మాపురం

పద్మాక్షి ఆలయంలో యోగా వేడుకలు



హన్మకొండ అర్బన్: జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా హనుమకొండ పద్మాక్షి ఆలయ ప్రాంగణంలో శనివారం యోగా వేడుకలు నిర్వహించారు. ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో హరిత హోటల్ శిబిరంలోని యోగా సాధకులతో ఆలయం వద్ద యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామం చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు. జూన్ 21వరకు నగరంలోని చారిత్రక ప్రదేశాల్లో యోగా ప్రదర్శన, వేడుకలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

విద్యారణ్యపురి: హంటర్‌రోడ్డులోని వరంగల్ వెస్ట్ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో 2023 – 2024వ విద్యా సంవత్సరంలో మొదటి దశ ప్రవేశాలకు అర్హత సాధించిన విద్యార్థినులు అడ్మిషన్లు పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ భద్రకాళి శనివారం ఒక ప్రకటనలో కోరారు. జూన్ 1న బీఏ (హెచ్ఈపీ), ఎంపీసీఎస్, ఎంఎస్‌టీడీఎస్, 2న బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ, 3న బీకామ్ జనరల్, బీకామ్ సీఏలో ప్రవేశాలు పొందాలని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్ హాల్‌టికెట్, మెమో, టీయూజీసెట్ –2023 హాల్‌టికెట్, కులం, ఆదాయం, బోనోఫైడ్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు.

మెరుగైన సేవలు అందించడానికి శిక్షణ దోహదం



సర్టిఫికెట్ అందజేస్తున్న డీఎంహెచ్ఓ వెంకటరమణ

మడికొండ: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో వరంగల్ జిల్లా ఆశ కార్యకర్తలకు నిర్వహించిన నవజాత శిశువు, గృహ సందర్శన సంరక్షణ అంశాలపై ఇచ్చిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ హాజరై ఆశ కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల జీవితంలో వివిధ దశల్లో కనిపించే సమస్యలకు పరిష్కార మార్గాలు చూపించారు. రక్తహీనత, అంటువ్యాధులు, అనారోగ్య సమస్యల బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పిల్లల పోషకాహారం స్థితి, వృద్ధి వంటి తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది డాక్టర్ గోపాలరావు, జ్ఞానసుందరి, ప్రతాపగిరి ప్రసాద్, రజిని, మేరీ, మనోజ, వరమ్మ, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

ఏఓను డీఐఈఓ ఆఫీస్‌లో ఎలా కొనసాగిస్తారు?



వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎఫ్‌డీఎస్ బాధ్యులు

విద్యారణ్యపురి: మహబూబాబాద్ జిల్లా డీఐఈఓ కార్యాలయంలో ఏఓ హోదాలో విధులు నిర్వర్తించాల్సిన ఉద్యోగి (ఏఓ) హరిలాల్‌ను హనుమకొండ జిల్లా డీఐఈఓ కార్యాలయంలో విధుల్లో ఎలా కొనసాగిస్తారని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున ప్రశ్నించారు. ఈమేరకు అతనిపై చర్య తీసుకోవాలని హైదరాబాద్‌లో ఇంటర్ విద్య ఆర్‌జేడీ జయప్రద బాయిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండ డీఐఈఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) పోస్టు లేదని, ఈక్రమంలో కొంతకాలంగా ఆన్‌డ్యూటీ ఆర్డర్‌పై హరిలాల్ పని చేయటం సరికాదని అన్నారు. ఆన్‌డ్యూటీపై ఏఓగా విధులు నిర్వర్తిసున్న హరిలాల్‌పై పలు ఆరోపణలు ఉన్నాయని వివరించారు. ఆర్‌జేడీని కలిసిన వారిలో అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య బాధ్యులు సావిత్రి, ముద్రబోని భానుప్రసాద్, రాఘవ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు బ్రాహ్మణులు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేంద్రశర్మ

వరంగల్ చౌరస్తా: హైదరాబాద్ గోపనపల్లి బ్రాహ్మణ భవన్ ప్రారంభోత్సవానికి ఈనెల 31న బ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ పిలుపునిచ్చారు. వరంగల్ దుర్గేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శర్మ శివపురం రామలింగరాధ్య, కొత్తపల్లి ఫణిశర్మలతో కలిసి ఉపేంద్ర శర్మ మాట్లాడారు. బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి హైదరాబాద్‌లో 6 ఎకరాల స్థలంలో రూ.12కోట్ల నిధులతో బ్రాహ్మణ భవనానికి సీఎం కేసీఆర్ నిధులు కేటాయించి బ్రాహ్మణ జాతి పట్ల తన అభిమానాన్ని చాటుకున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయాల్లో పూజలు చేస్తున్న అర్చకులను రెగ్యులరైజ్ చేసి ప్రభుత్వం నేరుగా వేతనాలు అందిస్తోందని ఉపేంద్రశర్మ వివరించారు.

కుట్టుశిక్షణతో స్వయం ఉపాధి



సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న దర్శన్‌సింగ్

న్యూశాయంపేట: మహిళలు కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలవాలని రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యుడు జానీ దర్శన్‌సింగ్ సూచించారు. హనుమకొండ ములుగురోడ్డు ఎంసీసీ భవన్‌లో శాంతి సంఘం, మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు 3వ బ్యాచ్ ద్వారా ఉచిత కుట్టుశిక్షణ అందించారు. ఈ సందర్భంగా వారికి శనివారం సర్టిఫికెట్లు ప్రదానం చేసి, శిక్షణలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి మూడు కుట్టుమిషన్లను ఉచితంగా అందజేశారు. అనంతరం, మైనారిటీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా దర్శన్‌సింగ్‌ను సభ్యులు సన్మానించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ అనీస్ సిద్దిఖీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌డీడీ షాహిద్ మసూద్, మహ్మద్ ఎక్బాల్, లాజరస్, మహ్మద్ ఖలీల్, కౌసర్ ఫారూఖీ, సయ్యద్ అక్బర్, నదీమ్ బేగ్, మాషూఖ్ రబ్బానీ, మసూద్‌మిర్జా, నాజ్రీన్, నసీర్, మహ్మద్ అబ్దుల్ నయీం తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



ప్రశంసపత్రం అందజేస్తున్న శ్రీనివాస్, తదితరులు

కేయూ క్యాంపస్: రక్తదానం.. మరొకరికి ప్రాణదానం అని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. వరంగల్ ఎంజీఎం బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదాతలకు ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవితకాలంలో చేసే దానాల్లో రక్తదానం చాలా విలువైనదని వివరించారు. వాకర్స్ స్వచ్ఛందంగా 24 యూనిట్ల రక్తం దానం చేశారు. కార్యక్రమంలో దొంతి తిరుపతిరెడ్డి, ఉప్పుల కొమురయ్య, సందీప్, చిలువేరు శంకర్, రాంరెడ్డి, బ్లడ్ మోటివేటర్ రచ్చ కళ్యాణి, ఎంజీఎం సిబ్బంది మేరీ, శ్రీధర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన



ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు

కమలాపూర్: కమలాపూర్, గూడూరు గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ట్రైనీ ఐఏఎస్ అధికారి శ్రద్ధా శుక్లా, ఐపీఎస్ అధికారి అంకిత్ శనివారం సందర్శించారు. ఆయా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ, రైతులు విక్రయానికి తీసుకొచ్చిన వరి ధాన్యం, ధాన్యం తేమశాతాన్ని పరిశీలించారు. రైతులు, నిర్వాహకులతో మాట్లాడి చెల్లింపుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ వసంతలక్ష్మి, పౌర సరఫరాల శాఖ డీఎం మహేందర్, తహసీల్దార్ రాణి, వ్యవసాయాధికారి లక్ష్మారెడ్డి, నాయబ్ తహసీల్దార్ మమత, పీఏసీఎస్ సీఈఓ ఎండీ.చోటేమియా, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూకు నివాళి



హన్మకొండ చౌరస్తా: భారత మొదటి ప్రధాని దివంగత జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకుని హనుమకొండలోని డీసీసీ భవన్‌లో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు బంక సరళ మాట్లాడుతూ పంచవర్ష ప్రణాళికల ద్వారా నవ భారతానికి పునాదులు వేసిన మహనీయుడు నెహ్రూ అని కొనియాడారు. దేశ ప్రజల కోసం నెహ్రూ కుటుంబం వారి జీవితాలను అంకితమిచ్చిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్, సతీష్, సంపత్, అంకూస్, జాఫర్, సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, సారంగం పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన పద్మశాలీలు

ఖిలా వరంగల్: హైదరాబాద్‌లోని కోకాపేటలో పద్మశాలి ఆత్మగౌరవ భవనానికి భూమిపూజ సందర్భంగా వరంగల్ పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్లు, బస్సుల్లో పెద్ద సంఖ్యలో పద్మశాలీ కులస్తులు శనివారం తరలివెళ్లారు. అంతకుముందు వరంగల్ శివనగర్‌లో జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీల ఐక్యత సాధనే పద్మశాలీల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి నిదర్శనమని అన్నారు. ప్రతీఒక్కరు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ ట్రస్టు అధ్యక్షుడు బుదారపు భాస్కర్, చింతల సోమయ్య, దాసి సురేందర్, కస్తూరి శ్రీనివాస్, కిరణ్, ఆడెపు శ్యామ్, కుడికాల మనోహర్, గుజ్జ నాగరాజు, కౌశిక్, రాజలింగం, శ్రీధర్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'లో రిజర్వేషన్ కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కరీమాబాద్: ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకంలో వికలాంగులకు రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ వికలాంగుల ఫోరం ప్రతినిధులు కోరారు. ఈమేరకు అడిషనల్ కలెక్టర్ అశ్వినితానాజీ వాకాడేకు శనివారం వినతిపత్రం అందజేశారు. వికలాంగుల కోసం శనివారం ప్రత్యేక గ్రీవెన్‌సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, కార్పొరేషన్ ద్వారా రుణాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు పిన్నింటి రవీందర్‌రావు, విజయ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాజీపేటతో విడదీయరాని బంధం



సోమిడిలో మాట్లాడుతున్న చీఫ్ విప్

కాజీపేట: కాజీపేట పట్టణ ప్రజలతో దాస్యం కుటుంబానికి నాలుగు దశాబ్దాలుగా విడదీయరాని పేగుబంధం ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట పట్టణంలోని సోమిడి బాలయేసు మందిరంతో పాటు వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్, బృందావన్ కాలనీ, వైఎస్సార్ కాలనీల్లో చీఫ్‌విప్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ నగర్‌కాలనీ వాసులకు విద్యుత్తు సౌకర్యం కల్పించడంతో పాటు రవాణా, తాగునీటి వసతి కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలనీవాసులకు ఇంటి నివేశన స్థలాలు ఇవ్వాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. రహదారులపై చిరు వ్యాపారులు కూరగాయలు అమ్ముకుండా చూస్తామని వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ వ్యాపారులకు హామీ ఇచ్చారు. బృందావన్ కాలనీ అభివృద్ధితో పాటు బాలయేసు మందిర నిర్మాణానికి అవసరమైన చేయూతనందిస్తానని స్పష్టం చేశారు. 58 జీఓ ప్రకారం ఇద్దరికి ఇంటి నివేశన స్థలాల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజు, ట్రాన్స్‌కో ఏడీ సుబ్రహ్మణ్యం, ఏఈ మురళి, జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యుడు సుంచు కృష్ణ, ఆర్టీఏ కమిటీ సభ్యుడు కాటపురం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం కోసం వ్యాయామం చేయండి

హన్మకొండ చౌరస్తా: ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతీఒక్కరు రోజుకు అరగంట పాటు నడక, వ్యాయామం అలవర్చుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సూచించారు. హనుమకొండలోని యాదవనగర్ కెనాల్ కట్టపై రూ.5లక్షల మున్సిపల్ నిధుల వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను శనివారం ప్రారంభించారు. కార్పొరేటర్ అశోక్, పార్టీ 4వ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు సిద్దోజు రమేష్, సిద్దంశెట్టి శ్రీనివాస్, హన్మకొండ భద్రి, నారాయణగిరి రాజు, నేతుల రఘు, బొక్క అశోక్ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి.. పేదింటి ఆడబిడ్డలకు వరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్

కరీమాబాద్: పేదింటి ఆడబిడ్డల వివాహాలు తల్లిదండ్రులకు భారం కావద్దనే ఆలోచనతో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టారని వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ తెలిపారు. ఈ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు వరంగా మారాయని కొనియాడారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 43, 44వ డివిజన్లలో ఎమ్మెల్యే శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గణేష్‌నగర్, రాంగోపాలపురం, పెన్షన్‌పూర్, తిమ్మాపూర్, మామునూరు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. నక్కలపల్లిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ విగ్రహ భూమిపూజలో ఆయన పాల్గొన్నారు. మామునూరు గ్రామానికి చెందిన చిత్రం మమత, కలకోట్ల సావిత్రి ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందగా, బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదురు అరుణ, డివిజన్ అధ్యక్షులు స్పందన్, జైపాల్‌రెడ్డి, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులతో బీఆర్ఎస్ కలిసిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట: బీజేపీని భూస్థాపితం చేసేందుకు కమ్యూనిస్టులతో బీఆర్ఎస్ పార్టీ కలిసి రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల, గ్రామ శాఖల కార్యదర్శుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ లౌకిక శక్తుల ఐక్యతతోనే దేశంలో బీజేపీని ఓడించవచ్చని వివరించారు. మతోన్మాద చర్యలను ప్రజలు సహించబోరని, అందుకు ఇటీవల కర్ణాటక ఫలితాలే నిదర్శనమని తెలిపారు. రాష్ట్రంలో, దేశంలో బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకునే శక్తి కమ్యూనిస్టులకు ఉందని గుర్తుచేశారు. వచ్చేనెల 4న భద్రాద్రి కొత్తగూడెంలో లక్షమందితో ప్రజాగర్జన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, నాయకులు కర్రె భిక్షపతి, తోట భిక్షపతి, ఎల్లేశ్, రాములు లక్ష్మణ్, భిక్షపతి, ఓదెలు, రాజమౌళి, రవి, శంకర్, సదానందం పాల్గొన్నారు.